సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



పాఠశాలల పనితీరు భేష్

వేములపూడి పీజీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, కేజీబీవీని ఢిల్లీ బృందం గురువారం సందర్శించింది. 8లో



విస్తృత దాడులు

అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. కేసులు నమోదు చేస్తూ దడ పుట్టిస్తున్నారు. 8లో



గ్లోబల్ అవార్డు ప్రదానం

విశాఖ: హెచ్‌పీసీఎల్ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు మూడోసారి గ్లోబల్ హెచ్‌ఆర్ అవార్డు లభించింది.

నిబంధనలకు నీళ్లు

చక్కని ఆరోగ్యానికి పరిశుద్ధమైన తాగునీరు అవసరమన్న స్పృహ పెరగడంతో మినరల్ వాటర్‌కు గిరాకీ పెరిగింది. దీంతో వీధికో ఆర్వో ప్లాంట్లు పుట్టుకొచ్చాయి. అక్కడి నుంచి నీరు తెచ్చుకొని తాగితే చాలు ఇక విశ్రాంతిగా ఉండవచ్చని వినియోగదారులు భావిస్తున్నారు. కానీ లైసెన్స్ ఉందా.. నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా.. నిజంగా ఆ నీరు సురక్షితమేనా అనే విషయాలను పట్టించుకోవడం లేదు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అడపాదడపా దాడులు చేసి, చర్యలు తీసుకుంటున్నారు. అనధికార ఆర్వో ప్లాంట్ల కట్టడికి మరింత కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

- మినరల్ వాటర్ పేరిట అనధికార ఆర్వో ప్లాంట్లు
- నాణ్యత ప్రమాణాలు పాటించని యాజమాన్యాలు
- ఐఎస్ఓ మార్కుతో మోసం చేస్తున్న వ్యాపారులు
- ఇప్పటి వరకు 9 ప్లాంట్ల సీజ్, 20 కేసుల నమోదు
- సీజ్ చేసిన వాటర్‌ప్లాంట్లలో తెర వెనుక వ్యాపారం



సీజ్ చేసిన వాటర్‌ప్లాంట్



వాటర్‌ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి

సాక్షి, అనకాపల్లి: తాగునీరు కాసులు కురిపించే కల్పతరువుగా మారింది. వాతావరణ మార్పుల కారణంగా పర్యావరణం కలుషితం కావడంతో మినరల్ వాటర్ తాగే వారి సంఖ్య పెరిగింది. గతంలో పట్టణాలకే పరిమితమైన వాటర్ ప్లాంట్లు ఇప్పుడు గ్రామాల్లో కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. జిల్లాలో లక్షల్లో మంచినీటి వ్యాపారం జరుగుతోంది. వాటర్‌ప్లాంట్లను అనధికారికంగా నడిపేవారి సంఖ్య ఎక్కువైంది. నిబంధనలను ఉల్లంఘిస్తూ...నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా వాటర్ ప్లాంట్లను నడిపిస్తున్నారు. జిల్లాలో అనుమతి లేని 9 మినరల్ ప్లాంట్లను గుర్తించి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు. మరో 20 ప్లాంట్లపై కేసులు నమోదుచేసి జరిమానా విధించారు. జిల్లాలో 100కి పైగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నా.. వీటిలో 30 నుంచి 40 వరకు మాత్రమే ఆథరైజ్డ్ వాటర్ ప్లాంట్లున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు.

ఐఎస్ఓ మార్కుతో మోసం చేస్తున్న వ్యాపారులు

వేసవి కాలం సమీపించే కొద్దీ మినరల్ వాటర్‌కి డిమాండ్ పెరుగుతుంది. పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా వీటి విక్రయాలు జోరందుకుంటాయి. డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని తగినంత నాణ్యత పాటించకుండానే ఐఎస్ఓ మార్క్‌తో వ్యాపారులు మోసం చేస్తున్నారు. వివాహాలకు, వివిధ ఫంక్షన్లకు యథేచ్ఛగా సరఫరా చేస్తున్నారు. ఐఎస్ఐ, ఎఫ్ఎస్ఎస్ఏఐ స్టాండర్డ్స్ లేని ప్లాంట్లను అధికారులు సీజ్ చేస్తున్నా మోసాలు ఆగడం లేదు. కొన్ని సందర్భాల్లో ఈ నీళ్లలో కలిపే రసాయన పదార్థాలు అనారోగ్యానికి దారి తీస్తున్నాయి.

వాటర్ ప్లాంట్లపై చర్యలు ఇలా..

వాటర్‌ప్లాంట్లలో బీఏఎస్, నాన్ బీఏఎస్ అని రెండు రకాలు ఉంటాయి. బీఏఎస్ సర్టిఫికెట్ తీసుకుంటే ప్లాంట్లో వాటర్ టెస్టింగ్ ల్యాబ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. అక్కడ టెస్టింగ్ చేసే టెక్నీషియన్ ఉండాలి. ఈ అనుమతి పొందాలంటే రూ.లక్షా 50 వేల వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. బీఎస్ఏ ప్లాంట్లు జిల్లాలో లేవు. అనకాపల్లి జిల్లాలో ఉన్నవన్నీ నాన్ బీఏఎస్ వాటర్ ప్లాంట్లే. ఇక్కడ వాటర్ నాణ్యతను పరీక్షించడానికి శ్యాంపిల్స్‌ను హైదరాబాద్‌కు ఫుడ్ సేఫ్టీ అధికారులు పంపిస్తారు. నాణ్యత లేకుండా విక్రయించే వాటర్‌ప్లాంట్లను సబ్ స్టాండర్డ్, మిస్ బ్రాండ్, మిస్‌స్టాండర్డ్, అన్ సేఫ్ అని నాలుగు రకాలుగా విభజించి చర్యలు తీసుకుంటారు. సబ్ స్టాండర్డ్, మిస్ స్టాండర్డ్ టైప్ వాటర్ ప్లాంట్లకు రూ.2లక్షల వరకు జరిమానా విధిస్తారు. అదే మిస్‌బ్రాండ్ అయితే రూ.5 లక్షల వరకు జరిమానా వుంటుంది. 'అన్ సేఫ్' కేటగిరీలోకి వస్తే వారిపై కేసు నమోదు చేసి సీజ్ చేస్తారు. రెవెన్యూ అధికారులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసి, అనుమతి లేని వాటర్‌ప్లాంట్లు, ఐఎస్ఓ మార్క్ లేని ప్లాంట్లను 133 సీఆర్‌పీసీ సెక్షన్ కింద సీజ్ చేస్తున్నారు.

తప్పకుండా ఉండాల్సినవి....

- ఐఎస్ఐ/ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తు
- ప్యాకింగ్ తేదీ
- డేట్ ఆఫ్ ఎక్స్‌పైరీ
- బ్యాచ్ నెంబర్
- మాన్యుఫ్యాక్చరర్ అడ్రస్

బ్యాక్ డోర్ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు



నాణ్యత లేకుండా మినరల్ వాటర్ విక్రయించే ప్లాంట్లను సీజ్ చేశాం. సీజ్ చేసినా వారు బ్యాక్ డోర్ వ్యాపారానికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అలా చేసిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటాం. తాగునీటి నాణ్యతపై ఎక్కడైనా ఫిర్యాదులు ఉంటే తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. మండలాల వారీగా వాటర్ ప్లాంట్లను రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తారు.

–రవికుమార్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి

న్యూస్‌రీల్

తొలి రోజు ఒకటి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థి నామినేషన్

మహారాణిపేట (విశాఖ): ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పీడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా కోరెడ్ల రమాప్రభ నామినేషన్ దాఖలు చేశారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం తన నామినేషన్ పత్రాలను(రెండు సెట్లు) ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.ఎ.మల్లికార్జునకు అందజేశారు. అంతకుముందు ఆమె డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా రమాప్రభ మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యావంతుల వాణిని చట్టసభల్లో సమర్థవంతంగా వినిపించాలంటే తనను గెలిపించాలన్నారు. రాష్ట్ర విభజన చట్టం అమలు చేయకుండా కేంద్రం ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోందన్నారు. ఉత్తరాంధ్రకు చట్ట ప్రకారం ప్రత్యేక నిధులు రావడం లేదని, తొమ్మిదేళ్లయినా రైల్వే జోన్‌కు అతీగతి లేదన్నారు. పెట్రో, గిరిజన యూనివర్సిటీ నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదన్నారు. తొలుత ఆమె అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వర్లు, లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ తదితరులు పాల్గొన్నారు.

28న కంచి కామకోటి పీఠాధిపతి అనకాపల్లి రాక



అనకాపల్లి టౌన్: కంచి కామకోటి పీఠాధిపతి శంకరవిజయేంద్ర సరస్వతి స్వామి ఈనెల 28న సాయంత్రం స్థానిక కన్యకాపరమేశ్వరి దేవాలయానికి వస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సుంకరమెట్ట జంక్షన్ నుంచి స్వామివారి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మార్చి 1, 2 తేదీల్లో ఆలయంలో త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్

సబ్ రిజిస్ట్రార్ సహా నలుగురిపై కేసు

అనకాపల్లి టౌన్: నకిలీ డాక్యుమెంట్లతో భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న ముగ్గురితోపాటు అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్–2పై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ మోహనరావు గురువారం చెప్పారు. సీఐ అందించిన వివరాలు.. విశాఖ తాటిచెట్లపాలేనికి చెందిన పి.ఉషారాణికి ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు గ్రామంలో ఏడెకరాల 59 సెంట్ల భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన పి.సుబ్బలక్ష్మి, పి.శ్రీకాంత్, సాయి శ్రీనివాస్‌లు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలు పి.ఉషారాణి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సూర్యనారాయణను ఆశ్రయించారు. జాయింట్ రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు సబ్ రిజిస్ట్రార్–2 బసవేశ్వరరావు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

చదువుతోపాటు క్రీడలు

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి



స్కేటర్ల జట్టుతో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

విశాఖ స్పోర్ట్స్: చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్య ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. అంతర వర్సిటీల మెన్, వుమెన్ రోలర్ స్పోర్ట్స్‌ను శివాజీపార్క్‌లోని రింక్‌లో గురువారం వీసీ ప్రారంభించి మాట్లాడారు. మార్కులకే ప్రాధాన్యమిస్తున్న తరుణంలో కొందరు తల్లిదండ్రులు ఆటలు ఆడేందుకు పిల్లలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఏయూలో ఇటీవల క్రీడా మైదానాలను అభివృద్ధి చేశామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన స్కేటర్లు విశాఖ అందాలను వీక్షించాలన్నారు. ఆర్టిస్టిక్ పోటీలకు శివాజీ పార్క్ వేదిక కానుండగా రోలర్ స్పోర్ట్స్, ఇన్ లైన్ హాకీ, స్కేట్ బోర్డ్ పోటీలను వీఎంఆర్డీఏ పార్కులో, పార్కు దరి బీచ్‌రోడ్‌లో స్పీడ్ రేస్‌లు నిర్వహించనున్నారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి విజయమోహన్, పీఈ విభాగ హెచ్‌వోడీ పల్లవి, స్కేటింగ్ సంఘం ప్రతినిధులు భగీరథ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జీ20 సదస్సుకు తొలి అడుగు



సదస్సును ప్రారంభిస్తున్న మంత్రులు విడదల రజని, పీడిక రాజన్నదొర, గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పల్సస్ సీఈవో శ్రీనుబాబు

- విశాఖలో ప్రారంభమైన గ్లోబల్‌టెక్ సమ్మిట్
- హాజరైన వివిధ దేశాల ప్రతినిధులు
- టెక్నాలజీ, ఫార్మా, వ్యవసాయ రంగాలపై చర్చ

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చే నెల నిర్వహించనున్న ప్రతిష్టాత్మక జీ20 సదస్సుకు తొలి సన్నాహకంగా.. విశాఖ వేదికగా గ్లోబల్ టెక్ సమ్మిట్–2023 గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న టెక్ సమ్మిట్‌ని ఏపీలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పల్సస్ గ్రూప్ నేతృత్వంలో నిర్వహించారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, పీడిక రాజన్నదొర, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు సదస్సును ప్రారంభించారు. సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులు, వాటిని అందిపుచ్చుకునేందుకు ఉన్న అవకాశాలు, వనరులపై దేశ, విదేశీ ప్రతినిధులు చర్చించేందుకు వీలుగా ఈ సమ్మిట్ నిర్వహించారు.

భవిష్యత్తులో టెక్నాలజీ రంగంలో చోటుచేసుకోనున్న పరిణామాలను ఏ విధంగా ఆకళింపు చేసుకోవాలి.. ఐటీ పరిశ్రమలతో కలిసి గ్లోబల్ కమ్యూనిటీని రూపొందించుకోవాల్సిన అంశాలపై వివిధ దేశాల ప్రతినిధులు చర్చించారు. వచ్చే నెలలో జరగనున్న జీ20 సదస్సుకు అనుబంధంగా ఈ సమ్మిట్‌ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది గ్లోబల్ టెక్ సమ్మిట్‌ని రియాద్, సియోల్, టోక్యో, రోమ్, పారిస్, న్యూయార్క్, మెల్‌బోర్న్, బీజింగ్, లండన్, టోక్యో, న్యూఢిల్లీతో సహా జీ20 దేశాల్లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ని ఇప్పటికే రూపొందించారు. టెక్ పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వివిధ దేశాల ప్రతినిధులు తొలిరోజున చర్చించారు. విద్యా విధానంలో టెక్నాలజీ, టెలి కమ్యూనికేషన్ రంగంలో సాంకేతికత ఆధారంగా తీసుకొస్తున్న సంస్కరణలు, భారత్ బిజినెస్ కారిడార్, ఫార్మా రంగంలో టెక్నాలజీ పాత్ర, మేథో సంపత్తి, ఆవిష్కరణల వృద్ధి, బయోఫార్మా రంగంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ తదితర అంశాలపై సెషన్లు నిర్వహించారు. భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ ఆధ్వర్యంలో టెక్నాలజీని అందిపుచ్చుకోవడం.. సమాజంలో సాధికారత సాధించడం అనే అంశంపై నిర్వహించిన సెషన్లో డిజిటల్ భారత్‌పై చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చెయిన్, ఐవోటీ రంగాల అభివృద్ధికి సంబంధించి విశాఖలో ఉన్న అవకాశాలపై చర్చించారు. శుక్రవారం సాయంత్రంతో సదస్సు ముగియనుంది. రెండో రోజున స్టార్టప్‌ల అభివృద్ధి, చేయూత, టెక్నాలజీ, ఫార్మా తదితర రంగాల్లో రానున్న మార్పులపై సెషన్లు ఉంటాయని పల్సస్ సీఈవో శ్రీనుబాబు తెలిపారు.

సమస్యలపై స్పందించకుంటే సహించం

- బీసీ సంక్షేమశాఖ మంత్రి వేణుగోపాలకృష్ణ
- లింగరాజుపాలెం జ్యోతిబాపూలే పాఠశాల సందర్శన
- విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న వైనం
- ప్రిన్సిపాల్‌పై చర్యలకు ఆదేశాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి



అధికారులకు ఆదేశాలు ఇస్తున్న మంత్రి

ఎస్.రాయవరం : విద్యార్థినులకు ఇబ్బందులు కలిగితే ప్రిన్సిపాల్ నాగవేణి రోజుల తరబడి ఎందుకు సరి చేయలేదని, వెంటనే ఆమెను విధుల నుంచి తొలగించి చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అధికారులకు సూచించారు. లింగరాజుపాలెంలో మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలను మంత్రి గురువారం సందర్శించారు. పాఠశాలలో సమస్యలు తలెత్తితే సహించేది లేదని సీఎం నుంచి నేరుగా సమాచారం రావడంతో తాను వచ్చినట్టు చెప్పారు. పాఠశాలలో మోటారు సమస్య సరిచేయనందు వల్లే మరుగుదొడ్ల సమస్య వచ్చిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు విన్నారు. వసతి, తరగతి గదులు ఒకే చోట నిర్వహణ జరుగుతోందని, భోజనం చేయడానికి డైనింగ్‌హాల్ లేదని, మరుగుదొడ్లు పూర్తి స్థాయిలో లేవని, పాఠశాలకు నీటి సదుపాయం, తాగునీటి సదుపాయాలు లేవని, కొన్ని సబ్జెక్టులకు టీచర్ల బోధన కూడా బాగా లేదని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మంత్రి భవనాన్ని పూర్తి స్థాయిలో పరిశీలించారు. మరుగుదొడ్లను సహితం నేరుగా వెళ్లి తనిఖీ చేశారు. సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆయన వెంట విజయవాడ నుంచి వచ్చిన బీసీ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ కృష్ణమోహన్‌కు ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే విద్యార్థుల తాగునీటి వసతికి ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు సరిపడా 215 మందికి 24 మరుగుదొడ్లు ఉన్నాయని వాటి వినియోగం పరిశీలించాలని సూచించారు. తరగతి గదులు, వసతి సదుపాయం తాత్కాలికంగా పెంచాలన్నారు. శాశ్వత భవనం ఏర్పాటు అయ్యే వరకు ఈ భవనంలో కల్పించాల్సిన సదుపాయాలు తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. శాశ్వత భవనానికి స్థలం కేటాయింపు చేయగానే రూ.36 కోట్లతో అన్ని సదుపాయాలతో భవనం నిర్మాణం చేస్తామన్నారు. అందుకు సుమారు 5 ఎకరాలు స్థలం కావాలన్నారు.

అనంతరం మంత్రి వేణుగోపాలకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల్లో, వసతి గృహాల్లో సమస్యలు ఉండకూడదని సీఎం నిత్యం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఈ పాఠశాలలో విద్యార్థుల వీడియోలు సమాచారం తెలిసిన వెంటనే పాఠశాలను సందర్శించాలని సీఎం ఆఫీస్ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. విద్య కోసం ఎన్ని కోట్లు ఖర్చు చేయడానికి అయినా సీఎం వెనకాడడం లేదన్నారు. ప్రతిపేదవాడు మంచి చదువులు చదువుకోవాలని విద్యాశాఖకు రూ.3 వేల కోట్లు కేటాయించారని తెలిపారు.

ఇలా ఉండగా బీసీ వెల్ఫేర్ వసతి గృహాల్లో సమస్యలు పేరుకుపోయాయని ఎస్ఎఫ్ఐ సభ్యులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి స్పందిస్తూ అక్కడే ఉన్న బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వరికి తగు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో బీసీ వెల్ఫేర్ వసతి గృహాలు సందర్శించి సమస్యలుంటే నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథరావు, సర్పంచ్‌లు కోశెట్టి వెంకటరమణ, కొప్పిశెట్టి సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు, ఈతకొట్టు నాగు, అన్నందేవర బాబ్జి, ఎస్.రాయవరం పీఏసీఎస్ చైర్మన్ అల్లాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ నాగవేణి సస్పెన్షన్‌కు జేసీ ఆదేశాలు



లింగరాజుపాలెంలో పాఠశాలను సందర్శించిన జేసీ కల్పనా కుమారి

ఎస్.రాయవరం: లింగరాజుపాలెం మహాత్మా జ్యోతీబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ నాగవేణిని సస్పెండ్ చేస్తున్నట్టు జేసీ కల్పనాకుమారి తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్ల సమస్య తలెత్తితే సరి చేయకుండా ఐదు రోజులు జాప్యం చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. విద్యార్థులు తల్లిదండ్రులకు సమస్య చెప్పుకుంటే కాని పరిష్కారం లేని పరిస్థితి ప్రిన్సిపాల్ తీసుకువచ్చారన్నారు. తాను పాఠశాలను సందర్శించానని తాత్కాలికంగా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సదుపాయాలు ఉన్నాయని, నివేదికల ఆధారంగా పూర్తి సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం దార్లపూడిలో నూతనంగా నిర్మాణం చేసిన సోషల్ వెల్ఫేర్ భవనాన్ని జేసీ పరిశీలించారు. వీలైతే మార్పు చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

గౌరీశ్వరస్వామి కల్యాణోత్సవాలకు శ్రీకారం



లక్ష కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ

చోడవరం: స్వయంభూ గౌరీశ్వరస్వామి వారి కల్యాణ, శివరాత్రి మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి స్వామి వారికి లక్ష కుంకుమార్చన, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి తిరువీధోత్సవం పట్టణ పురవీధుల్లో మేళతాళాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. పార్వతీదేవి సమేతుడైన శ్రీ గౌరీశ్వరస్వామివారి ఉత్సవ మూర్తులను పులి వాహనంపై ఉంచి ప్రత్యేక అలంకరణతో తిరువీధోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొండమంచిలి చలపతి ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. మధ్యాహ్నం అన్నదానం చేయగా వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం, కోనేరు వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ అందర్నీ ఆకట్టుకుంది.

శివరాత్రి వేడుకల్లో పాల్గొనడం నా అదృష్టం

ఆరు రోజులపాటు జరగనున్న వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, ప్రముఖ సినీ హాస్యనటుడు అలీ.. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో కళామందిరం వద్ద ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తాను సినీ ఇండస్ట్రీకి వచ్చి 45 ఏళ్లు అయిందని, ప్రేక్షకుల ఆదరాభిమానాలతోనే 1200 చిత్రాల్లో నటించగలిగానన్నారు. ధర్మశ్రీ మాట్లాడుతూ ఉత్సవాలను ఈ ఏడాది మరింత ఘనంగా చేయాలని ఏర్పాట్లు చేశామన్నారు. సురభి సంస్థ ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటకం అలరించింది. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ఉత్సవ కమిటీ చైర్మన్ గూనూరు సత్తిబాబు, దేవదాయశాఖ ఈఓ సత్యనారాయణమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రతినిధి పల్లా నర్సింగరావు పాల్గొన్నారు.



భక్తప్రహ్లాద.. సురభి నాటక ప్రదర్శన

సమన్వయంతోనే పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు

అధికారులతో సమీక్షలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



తుమ్మపాల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను అధికారులంతా సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించేందుకు కృషి చేయాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి సూచించారు. ఎన్నికల నిర్వహణ, సన్నద్ధతపై ఎన్నికల నోడల్ అధికారులతో గురువారం ఆయన తన చాంబర్లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 13న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నిర్దేశించిన తేదీల్లో సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఎన్నికలు జరిగే మండలాల్లో సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను వెంటనే గుర్తించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించే సమయంలో వారి సొంత మండలం, ఉద్యోగ విధులు నిర్వహించే మండలాలు కాకుండా చూడాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మోడల్ కోడ్‌ను పక్కాగా అమలుచేయాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ తప్పనిసరన్నారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి వీడియోగ్రాఫర్, మైక్రో అబ్జర్వర్, రూట్ ఆఫీసర్, సెక్టోరల్ ఆఫీసర్, లైజన్ ఆఫీసర్లను నియమించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా అవసరమైన సదుపాయాలు, సామగ్రిని వెంటనే తనకు తెలియజేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ప్రజలకు తెలియజేయాల్సిన అంశాలను ఎప్పటికప్పుడు మీడియాకు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పి.వెంకటరమణ, నోడల్ అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

బైజూస్ యాప్ వినియోగంలో ముందంజ



ఉపాధ్యాయులతో విద్యార్థులు వరుణ్, భవ్యశ్రీ

మాకవరపాలెం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన బైజూస్ యాప్ వినియోగంలో మండలంలోని పైడిపాల విద్యార్థులు జిల్లా స్థాయిలోనే ముందంజలో ఉన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి వాటిలో బైజూస్ యాప్ ద్వారా పాఠ్యాంశాలను అందుబాటులో ఉంచారు. ఈ మేరకు పైడిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కోలా వరుణ్, భవ్య శ్రీ ఇప్పటివరకు 2,600 నిమిషాలు దాటి బైజూస్ యాప్‌ను వినియోగించి ముందంజలో ఉన్నారు. వీరిని గురువారం హెచ్‌ఎం నూకరాజు, క్లాస్ టీచర్ రాము అభినందించారు.

కారు ఢీకొని క్లీనర్ మృతి


మృతుడు దుర్గా వెంకట అప్పారావు

యలమంచిలి: కారు ఢీకొట్టిన ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం రాత్రి తుని నుంచి అనకాపల్లి వెళుతూ లారీని అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామానికి చెందిన క్లీనర్ వెలుగుల దుర్గా వెంకట అప్పారావు (28) లక్కవరం జంక్షన్ వద్ద నిలిపి హైవే అవతలి వైపు ఉన్న హోటల్‌కి భోజనం నిమిత్తం రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో వెంకట అప్పారావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

శైవక్షేత్రాలు ముస్తాబు

- రేపటి నుంచి కల్యాణపులోవ మహా తిరునాళ్లు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

జిల్లాలోనే ప్రసిద్ధ శైవక్షేత్రాలు మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం దేవదాయ శాఖ అధికారులు, ఆలయాల కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.


యాత్రికుల స్నానాల రేవును శుభ్రం చేస్తున్న కార్మికులు


పోతురాజుబాబుగా పూజలందుకుంటున్న శివలింగం

రావికమతం: గిరిజనుల ఆరాధ్య దైవంగా ప్రసిద్ధి చెందిన కల్యాణపులోవ కల్యాణ పోతురాజుబాబు తిరునాళ్లకు సర్వం సిద్ధమైంది. ఉత్తరాంధ్రలోనే పేరెన్నికగన్న ఉత్సవాల్లో ఒక్కటైన ఇక్కడి తిరునాళ్లు ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మూడు రోజుల్లో మూడు లక్షలకుపైగా భక్తులు వస్తారని దేవదాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎస్పీ గౌతమి సాలి, నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఇప్పటికే అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. తగిన సూచనలు చేశారు. గిరిజన గ్రామం కల్యాణపులోవలో 200 ఏళ్ల కిందట గిరిజన వంశీకుడు గురవడు కలలో పోతురాజుబాబు కనిపించగా, పెద్ద బూరుగుమాను చెట్టు వద్ద ఆలయాన్ని నిర్మించాడు. అప్పటి నుంచీ పూజలందుకుంటున్న ఈ ఆలయం 1965లో ఇక్కడ రిజర్వాయర్ నిర్మాణంతో నీటమునిగింది. దాంతో గ్రామ పెద్దలంతా ప్రస్తుతం పూజలందుకుంటున్న ఆలయాన్ని నిర్మించారు. మునుపటి ఆలయం వద్ద బూరుగుమాను (చెట్టు) మోడుగా మారినా పట్టు కోల్పోకుండా ఉండటం విశేషం.

ప్రత్యేక ఏర్పాట్లు:
స్నానాల రేవులో మహిళలకు ప్రత్యేక దదులు(గదులు) ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది, ప్రత్యేక వలంటీర్లు వంద మంది వరకు నియమిస్తున్నారు. రిజర్వాయర్‌లో లోపలికి ఈతకు వెళ్లకుండా రక్షణ ఏర్పాట్లు చేశారు. దంపతులు బ్రహ్మముడులు వేసుకుని స్నానమాచరించేందుకు 50 మంది పురోహితులు సిద్ధంగా ఉన్నారు.

మహా అన్నసమారాధన– అల్పాహారం
తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఈ ఏడాది నుంచి ఆలయం వద్ద భారీ షామియానాలు వేసి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో మహా అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం అల్పాహారం, ఎక్కడికక్కడ తాగునీరు, వైద్యం, తదితర సేవలు అందించనున్నారు.

400 మంది పోలీసు సిబ్బంది..
కొత్తకోట, దొండపూడి ఫారెస్ట్ ఠాణా, కల్యాణపులోవలో 400 మంది పోలీసు సిబ్బందితో రక్షణ ఏర్పాట్లు చేస్తున్నట్టు కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఆర్టీసీ బస్సులు మినహా మరే ఇతర వాహనాలకు అనుమతి లేదన్నారు. వీఐపీల వాహనాలకు పాస్‌లు ఇస్తున్నట్టు తెలిపారు.

65 ప్రత్యేక సర్వీసులు..
తిరునాళ్ల యాత్రీకులను చేర వేసేందుకుగానూ నర్సీపట్నం డిపో నుంచి 65 ప్రత్యేక సర్వీసులు వేస్తున్నామని మేనేజరు ఎం.ఎస్.ఎస్ ధీరజ్ తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉంటే మరిన్ని సర్వీసులు నడుపుతామన్నారు. చోడవరం, నర్సీపట్నం, కొత్తకోట, కన్నంపేట, కొంతలం, రోలుగుంట, రావికమతం, వడ్డాది, మాడుగుల నుంచి కల్యాణపులోవకు నేరుగా సర్వీసులు వేస్తామన్నారు.

పరమ పవిత్రం పంచదార్ల పుణ్యక్షేత్రం


పంచదార్ల పుణ్యక్షేత్రంలో క్షేత్ర పాలకుడు ఉమా ధర్మ లింగేశ్వరస్వామి


పవిత్రమైన ఆకాశధార

రాంబిల్లి: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పంచదార్ల పుణ్యక్షేత్రం మహా శివరాత్రి పూజలకు ముస్తాబైంది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఇక్కడికి తరలి రానున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. క్యూలైన్లు, విద్యుద్దీపాలంకరణ, పారిశుధ్య పనులు, పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గుడారాలను ఏర్పాటు చేస్తున్నారు.

శతాబ్దాల చరిత్ర
పంచదార్ల పుణ్యక్షేత్రానికి శతాబ్దాల చరిత్ర ఉంది. క్రీ.శ 11, 13 శతాబ్దాల్లో ఇక్కడ ఆలయాలను నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఇక్కడ నిత్యం ప్రవహించే ఐదు ధారలున్నాయి. ఇందులో ప్రధానమైన ఆకాశ ధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించి క్షేత్ర పాలకుడు ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోయి సర్వ శుభాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.

ఇలా చేరుకోవచ్చు
యలమంచిలి, అచ్యుతాపురం నుంచి 400వై నెంబరుతో ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. ఇంకా ఆటోలు, ట్రక్కర్లు వంటి వాహనాలు ద్వారా పంచదార్ల పుణ్యక్షేత్రానికి చేరుకోవచ్చు.

బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు


బ్రహ్మలింగేశ్వరస్వాయి ఆలయం

నర్సీపట్నం: మహాశివరాత్రి ఉత్సవాలకు బ్రహ్మలింగేశ్వరస్వామి, పాకలపాడు గురుదేవుల ఆశ్రమం, సత్యనారాయణస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. మున్సిపాలిటీ బలిఘట్టంలోని బలిఘట్టం త్రిశూల పర్వతంపై ప్రసిద్ధి చెందిన బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. బలిచక్రవర్తి తపస్సుకు మెచ్చిన బ్రహ్మ శివలింగాన్ని ప్రతిష్ఠించడంతో బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంగా ప్రసిద్ధి గాంచింది. ఈశ్వరుడు పశ్చిమ ముఖంగా ఉండి, సమీపంలో నది ఉత్తర ముఖంగా ప్రవహించడంతో కాశీతో సమానమని భక్తులు విశ్వాసం. ఎంతో విశిష్టత కలిగిన ఈ ఆలయాన్ని సందర్శించి శివలింగాన్ని దర్శించుకుంటారు. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తరవాహిని నదీ తీరంలో మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాటాకు గదులు నిర్మిస్తున్నారు. క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. పాకలపాడు గురుదేవుల ఆశ్రమం ఆశ్రమంలో గురుదేవులు ఆధ్యాత్మిక ప్రబోధనలు చేస్తూ ఈ ప్రాంత ప్రజలకు ఆరాధ్యదైవంగా చెరగని ముద్ర వేసుకున్నారు. ఏజెన్సీలో గురువు, భక్తులు శివరాత్రికి ఇక్కడకు చేరుకుంటారు. వారు పండించిన తొలి పంటను గురుదేవులకు సమర్పిస్తారు. మూడు రోజుల పాటు గురుదేవుల సేవలో గడుపుతారు.

ఏడుగురిపై అట్రాసిటీ కేసు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లికి చెందిన ఏడుగురు వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని నమోదు చేశామని టౌన్ సీఐ ఎన్.గణేష్ తెలిపారు. కులం పేరుతో దూషించి, నానా దుర్భాషలాడేరని అదే గ్రామానికి చెందిన పి.సాయికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పి.చినబాబు, బి.నాగరాజు, పి.లోవరాజుతో పాటు మరో నలుగురుపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. కేసును అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

మంచినీటి ట్యాంక్ మోటారు చోరీ


మోటారు దొంగతనం జరిగిన మంచి నీటి ట్యాంక్

బుచ్చెయ్యపేట: మండలంలో గల నీలకంఠాపురం గ్రామంలో మంచినీటి ట్యాంక్ మోటారును గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారు. ఇటీవల గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇంటింటి కుళాయి ఏర్పాటుకు సుమారు రూ.72 లక్షలు మంజూరు చేశారు. గ్రామంలో ఓవర్‌హెడ్ మంచినీటి పథకం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన మోటారును బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోవడంపై సర్పంచ్ పడాల నాగభూషణం అధికారులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు సీతయ్యపేట విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ

బుచ్చెయ్యపేట: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని సీతయ్యపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల పరవాడ మండలం లేమర్తిలో జిల్లా స్థాయి ఖోఖో అండర్ -14 స్కూల్ గేమ్స్‌లో పాల్గొన్న బి.లోకేష్, ఎస్. దుర్గాప్రసాద్ అత్యధిక ప్రతిభ చూపారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో జరిగే అండర్ - 14 రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం వి.వి. జగన్నాథరావు, దాడి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. విద్యార్థులను ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, సర్పంచ్ ఇందిర శ్రీనివాస్, స్కూల్ కమిటీ చైర్మన్ వజ్రపు బాబూరావు అభినందించారు.

నోట్ పుస్తకాలు చూసే తీరిక లేదా?

- ఏటికొప్పాక హైస్కూల్ ఉపాధ్యాయులపై డిప్యూటీ డీఈవో ఆగ్రహం
- హిందీ ఉపాధ్యాయుడికి మెమో జారీ


విద్యార్థుల నోటు పుస్తకాలను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

యలమంచిలి: నోటు పుస్తకాలు చూసే తీరిక లేదా? అని ఏటికొప్పాక జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులపై డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం ఇక్కడ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కృషి ప్రోగ్రామ్‌లో భాగంగా పాఠశాలలో బోధనా తీరును తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి నోట్ పుస్తకాలు పరిశీలించారు. నోట్ పుస్తకాల్లో ఉపాధ్యాయుల సంతకాలు ఎందుకు లేవు, అంత తీరిక లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ఎందుకు వెనుకబడి ఉన్నారని ప్రశ్నించారు. హిందీ ఉపాధ్యాయునికి మెమో జారీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులందరు కృషి చేయాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఎప్పటికప్పుడు విద్యార్థుల్లో అభ్యసనా నైపుణ్యాలు మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పర్యటనలో ఎంఈవో విశ్వనాథం పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై విస్తృత దాడులు

ఎస్పీ గౌతమి సాలి


పోలీస్ ప్రచార వాహనం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తుమ్మపాల: మద్యం, ఇసుక, గంజాయి, పశువుల అక్రమ రవాణా, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నామని ఎస్పీ గౌతమిసాలీ తెలిపారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గురువారం పలు కేసులు నమోదు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఎంవీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 470 కేసులు నమోదు చేసి రూ.1,21,672 ఈ–చలానా విధించామని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన 25 మందిపై కేసులు నమోదు చేసామని, 14 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెట్టామని అన్నారు. సారా తయారీదారులపై 9 కేసులు నమోదు చేసి, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని, 1000 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి, 17 లీటర్ల నాటు సారా, 12 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నామని అన్నారు. దిశా యాప్ పట్ల నిరంతరం ప్రజలకు అవగాహన చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 5,09,520 మందితో దిశా యాప్ డౌన్‌లోడ్ చేయించామని, 1,88,686 మందితో రిజిస్ట్రేషన్ చేయించామని తెలిపారు. వాహన తనిఖీలు, విజిబుల్ పోలీసింగ్, లాడ్జీలు, దాబాల్లో పోలీసులతో కలిసి ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. గ్రామ దేవతల పండుగలు, తీర్థాల్లో పోలీసులు బందోబస్తు చేస్తున్నామని, రాత్రి గస్తీల్లో సస్పెక్ట్ షీట్ హోల్డర్స్‌ను తనిఖీ చేస్తూ అనుమానస్పద వ్యక్తుల ఫిన్స్ పరికరంతో వేలిముద్రల ద్వారా నేరచరిత్ర తెలుసుకునేందుకు తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. నర్సీపట్టణం మండలం వేములపూడి పీబీఎంఎస్‌పీ స్కూల్, జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రచార వాహనం ద్వారా పోక్సో, దిశ యాప్, మహిళా చట్టాలపై అవగాహన కల్పించామని వివరించారు.

సినీ నటుడు అలీకి ఘన స్వాగతం


చోడవరంలో సినీ నటుడు అలీని సత్కరించిన ముస్లింలు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాదిలో సినీ నటుడు అలీని ముస్లింలు ఘనంగా సత్కరించారు. గురువారం రాత్రి ఇక్కడ జంక్షన్‌లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి ఆయన సందడి చేశారు. తొలుత ముస్లింలతోపాటు వైఎస్సార్ సీపీ వడ్డాది అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు గుమ్మిడి ప్రసాద్ ఘన స్వాగతం పలికారు.

చోడవరంలో సత్కారం
చోడవరం: రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీని చోడవరం ముస్లింలు ఘనంగా సత్కరించారు. గురువారం రాత్రి చోడవరం వచ్చిన ఆయనను చోడవరం పట్టణం, మండలంలో ఉన్న ముస్లింలు అంతా కలిసి పూలదండలు, శాలువాలతో సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల పనితీరు భేష్

వేములపూడి పాఠశాలల్లో ఢిల్లీ బృందం సందర్శన


విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న బృంద సభ్యులు

నర్సీపట్నం: మండలంలోని వేములపూడి పీబీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలను, బాలికోన్నత పాఠశాలను, కేజీబీవీని నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ ఆఫ్ మెంటార్ టీచర్స్ (ఎస్‌ఈఆర్టీ) ఆఫ్ ఢిల్లీ బృందం గురువారం సందర్శించింది. ఢిల్లీ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ కోఆర్డినేటర్ రామ్‌కిశోర్, ఓఎస్‌డీ సునీత, సీఎస్‌ఈ వైస్ ప్రిన్సిపాల్ రూనూ ఛౌదరీ ఆధ్వర్యంలో 30 మందితో కూడిన ఈ బృంద సభ్యులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విధానం, ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, గోరుముద్ద, బైజూస్ ట్యాబ్స్, ఇంగ్లిష్ మీడియం బోధన అమలు తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళిక, డైరీ, బోధనను అడిగి తెలుసుకున్నారు. మూడు నుంచి పదో తరగతుల బోధనకు ఉపాధ్యాయులను సబ్జెక్టుల వారీగా నియామకాన్ని ప్రశంసించారు. విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడటంపై ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులు, పాఠశాలల పనితీరు భేష్ అని కొనియాడారు. వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులను అభినందించారు. ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు సత్యనారాయణ, మోహన్‌రావు, ఉపాధ్యాయులు బృంద సభ్యులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు బృంద సభ్యులతో ఫొటోలు దిగారు. ఢిల్లీ బృందం వెంట డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్, ఎంఈవో సాయిశైలజ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ ఉన్నారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారి సన్నిధిలో జిల్లా న్యాయమూర్తి ఫణికుమార్, మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: స్థానిక విజయరామరాజుపేట మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు జిల్లా న్యాయమూర్తి ఫణికుమార్‌కు ఘనస్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించి ఘనంగా సత్కరించారు. సాయంత్రం మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బి.వి. సత్యవతి దంపతులు, విశాఖ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, రవి, కార్పొరేటర్లు మందపాటి సునీత, జానకీరామరాజు, జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్, పీలా లక్ష్మీసౌజన్య, రాంబాబు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి జాతరలో భాగంగా చిటికెలు, తప్పెటగుళ్లు, అమ్మవారి విద్యుత్ సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి.



క్లుప్తంగా

కొత్త అమావాస్య రాట మహోత్సవం



అమ్మవారి ఉత్సవ పందిరిరాటను వేస్తున్న తాకాశి రాజేష్ దంపతులు

అనకాపల్లిటౌన్ : కొత్త అమావాస్య వేడుకల్లో భాగంగా స్థానిక తాకాశివీధి శ్రీ నూకాంబిక అమ్మవారి పందిరిరాట కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ తాకాశి రాజేష్ దంపతులు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ మార్చి 21న కొత్త అమావాస్య పురస్కరించుకుని అమ్మవారి రాట వేయడం ఆనందంగా ఉందన్నారు. నెల రోజుల పాటు అమ్మవారి పండగను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తాకాశి కొండలరావు, సూర్యారావు, ఈశ్వరరావు, కృష్ణ, సతీష్, సత్యందొర, మహిళా భక్తులు పాల్గొన్నారు.

శివరాత్రి కరపత్రాల ఆవిష్కరణ



ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలో సిద్ధిలోకేశ్వరి సహిత శ్రీ అమృత మహాకాళేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 18న మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు పొలిమేర సత్యనారాయణ అన్నారు. ఆలయ ఆవరణలో మహాశివరాత్రి ఉత్సవ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి ఆలయంలో తెల్లవారు జామునుంచి శివలింగానికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వెల్లడించారు. రాత్రికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి బుద్ధ భూలోకనాయుడు, సభ్యులు పొలిమేర ఆనంద్, కర్రి సీతఅప్పలనాయుడు, యల్లపు వాసు, భాస్కరావు పాల్గొన్నారు.

భగవద్గీతతో జ్ఞాన యోగం

పరవాడ: భగవద్గీత ద్వారా కర్మ విధానం తెలుసుకుని జనన మరణ చక్రం నుంచి బయట పడాలని త్రైత సిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక- ప్రబోధ సేవా సమితి అనకాపల్లి కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ సూచించారు. పరవాడలో గురువారం హిందూ ధర్మ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో కమిటీ సభ్యులు ఇంటింట గ్రంథ పరిచయం చేశారు. త్రైత సిద్ధాంత భగవద్గీత చదవడం ద్వారా జ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 8,156 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
స్పెషల్	3,580	4,160
మొదటి రకం	3,470	3,650
రెండో రకం	3,080	3,450
మూడో రకం	2,950	3,070

అనకాపల్లి సినిమాలు

సార్	- రాజా
అమిగోస్	-సత్యనారాయణ స్క్రీన్-1
క్యాంటమేనియా(3డీ)	- సత్యనారాయణ స్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
క్యాంటమేనియా(3డీ)	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
చడ్డీగ్యాంగ్ (ఉదయం, మధ్యాహ్నం)	- శ్రీసత్య
వారసుడు (ఫస్ట్ షో, సెకండ్ షో)	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 108 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు , బీ పాజిటివ్-54 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-42 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

రైతుకు, నేలకు ప్రకృతి వ్యవ'సాయం'



పేడ, పప్పుదినుసుల పిండి, గోమూత్రంతో ఘన జీవామృతం తయారీ



ద్రవ జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు



జీవామృతాన్ని జీడిమామిడిపై పిచికారీ చేస్తున్న రైతు

- ప్రకృతి సేద్యంపై పెరుగుతున్న ఆసక్తి
- తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం
- ఆరోగ్యకర ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ

కశింకోట : మండలంలో ప్రకృతి వ్యవసాయం జోరందుకుంది. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి, భూముల సారాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. దీంతో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం గత ఏడాది కంటె 300 ఎకరాల పైబడి పెరిగింది. ప్రకృతి వ్యవసాయం సాగు వల్ల ఖర్చులు తగ్గడం, దిగుబడులు పెరుగుతుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

మండలంలో 2017 నుంచి ప్రకృతి వ్యవసాయ సాగును చేపట్టారు. ప్రస్తుతం 10 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. అచ్చెర్ల, మోసయ్యపేట, బంగారయ్యపేట, తాళ్లపాలెం, జి.సింగవరం, ఆనందపురం, అడ్డాం, సుందరయ్యపేట, చెరకాం, జి.భీమవరం గ్రామాల్లో సాగు జరుగుతోంది. గత ఏడాది 683 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. ఈ ఏడాది ప్రభుత్వ ప్రోత్సాహంతో సాగు విస్తీర్ణం 1,010 ఎకరాలకు పెరిగింది. మున్ముందు ఈ విస్తీర్ణం ఇంకా పెరగనుంది. స్వయం సహాయక సంఘాల్లోని సభ్య రైతులతోపాటు ఇతర రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించారు. వీరంతా దాదాపు సన్న, చిన్నకారు రైతులే. ఆకు కూరలు, కూరగాయలు, బొప్పాయి, నిమ్మ, నారింజ, మామిడి, జీడి మామిడి, వరి తదితర పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. జి.భీమవరం, అడ్డాం ప్రాంతంలో కొందరు రైతులు బొప్పాయిలో కూరగాయలను అంతర్ పంటగా సాగు చేస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు.

సహజ ఎరువులు, రసాయనాలు

పంటల సాగుకు ప్రకృతి సిద్ధంగా లభించే పదార్థాలు, ద్రవాలతో తయారు చేసిన ఎరువులు, క్రిమిసంహారక కషాయాలను వినియోగిస్తున్నారు. రసాయనిక ఎరువుల కంటే ఇవి తక్కువ ధరకు లభిస్తుండటంతో వీటిపై దృష్టి నిలిపారు. మామిడి, జీడిమామిడి పూతలపై పురుగుల నివారణకు, పూత నిలవడానికి పుల్లని మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రావణాన్ని, ఎరువుగా వాడటానికి ఆవుపేడ, బెల్లం, పప్పు దినుసుల పిండి, తగినంత గోమూత్రాన్ని కలిపి మిశ్రమంగా తయారు చేసిన ఉండలను పంటకు ఎరువుగా వాడుతున్నారు. అలాగే వీటికి నీటిని కలిపి తయారు చేసిన ద్రవ జీవామృతాన్ని పంటలపై చీడ పీడల నివారణకు, పంట బలవర్ధకంగా ఎదిగేందుకు వినియోగిస్తున్నారు. అగ్గి తెగులు నివారణకు మారేడు కషాయం, వరిలో సుడి దోమ నివారణకు రేడియో మొక్కల ఆకులతో తయారు చేసిన కషాయం, వైరస్ నివారణకు పేడ కషాయం, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తూ పంటలను పండిస్తున్నారు. వీటిని కొందరు రైతులు స్వయంగా తయారు చేసుకుంటున్నారు. మరికొందరు ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటు చేసిన మినీ దుకాణాల ద్వారా కొనుగోలు చేసుకుని, వ్యవసాయానికి వినియోగిస్తున్నారు.

మార్కెట్ విస్తరణతో రైతుల ఆసక్తి

మండంలోని గ్రామాల్లో ప్రకృతి సిద్ధంగా పండిన పంటల గురించి తెలుసుకుని, ఇతర ప్రాంతాల ప్రజలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా ఉత్పత్తులను కొనుగోలు చేసి, తీసుకెళుతున్నారు. దీంతో రైతులు తమ ఉత్పత్తులకు మార్కెటింగ్ లభిస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపేలా వెలుగు, ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి ప్రకృతి వ్యవసాయం సాగుకు ప్రోత్సహిస్తున్నారు. దీంతో మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపుతున్నారు.

అంతర పంటతో అదనపు ఆదాయం



సుమారు 2 ఎకరాల భూమిలో బొప్పాయి మొక్కలు నాటి ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పెంచుతున్నాను. ఇవి ఏపుగా ఎదిగాయి. ఫలసాయానికి వచ్చేలోగా అదనపు ఆదాయం కోసం అంతర్ పంటలుగా కూరగాయలు, ఆకు కూరలు సాగు చేపట్టాం. ఇవి కూడా ఏపుగా ఎదిగి విక్రయానికి సిద్ధమవుతున్నాయి.

–ద్వారపురెడ్డి అగ్గి అప్పలరాజు, బొప్పాయి సాగు రైతు, అడ్డాం

భూములు సారవంతం



ప్రకృతి వ్యవసాయం వల్ల భూములు సారవంతమవుతున్నాయి. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఆకు కూరలు సాగవుతున్నాయి. పట్టణం, దూర ప్రాంతాల నుంచి మా ఊరి మీదుగా వెళ్లేవారు ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రకృతి వ్యవసాయం సాగుతో ఆశించిన రాబడి వస్తోంది.

–మంచాల గణేష్, రైతు, జి.భీమవరం

పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయానికి కృషి



మండలంలోని 10 గ్రామాల్లో 1,010 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారు. దీనిలో 135 ఎకరాల్లో పూర్తిగా ప్రకృతి వ్యవసాయం పద్ధతులనే అవలంభిస్తున్నారు. మిగిలిన వారు పాక్షికంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి సాగు చేస్తున్నారు. నమ్మకం పెరగడం వల్లే గతేడాదికంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది.

– ద్వారపురెడ్డి రమణ, మండల ఇన్‌చార్జి, ప్రకృతి వ్యవసాయం

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్ : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను సూచించారు. స్థానిక జాతీయ రహదారిపై పూడిమడక జంక్షన్ వద్ద హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జిల్లా ఎస్పీ గౌతమి సాలి ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ నిర్వహించినట్టు తెలిపారు. నెల రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తామని, తర్వాతి నుంచి కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకుండా ప్రయాణించేవారే అత్యధికంగా మరణిస్తున్నట్టు వెల్లడించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ తమ చేతికి చిక్కిన సంఘటనల్లో వాహన యజమానులపై కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. ద్విచక్ర వాహనంపై నిబంధనల మేరకు ఇద్దరు వ్యక్తులు మాత్రమే ప్రయాణించాలని, ముగ్గురు ప్రయాణించినట్లయితే కేసులు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ జె.రమేష్, వాహనదారులు పాల్గొన్నారు.

నేడు ఉమారామలింగేశ్వర స్వామి పల్లకీ సేవ

అనకాపల్లిటౌన్ : స్థానిక శారదానది ఒడ్డున కొలువైన శ్రీ ఉమారామలింగేశ్వర స్వామివారి పల్లకీ సేవ శుక్రవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సాలగ్రామ రఘు గురువారం తెలిపారు. స్వామివారి పల్లకీ సేవలో భాగంగా ఉత్సవమూర్తులను పట్టణంలోని పురవీధుల గుండా మేళతాళాల నడుమ ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు.

గృహసారథులతో మంత్రి అమర్‌నాథ్ భేటీ నేడు

కశింకోట : కశింకోటలోని స్టేట్ బ్యాంకు వద్ద కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు సచివాలయ గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశం జరగనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కశింకోట, బయ్యవరం, వెదురుపర్తి, జమాదులపాలెం సచివాలయగృహ సారథులు, కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

తేగాడలో..

తేగాడలోని ఎస్‌ఆర్ రిసార్టులో ఉదయం 10 గంటలకు సచివాలయాల గృహ సారథులు, కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులతో మంత్రి సమక్షంలో సమావేశం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి తెలిపారు. ఈ సమావేశానికి ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, తేగాడ, కొత్తపల్లి, అచ్చెర్ల, జి.భీమవరం, ఈ.చౌడువాడ, తీడ, అమీన్‌సాహెబ్‌పేట, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని, నూతలగుంటపాలెం సచివాలయ పరిధిలోని వారంతా హాజరుకావాలని కోరారు.

శివరాత్రి గోడపత్రిక ఆవిష్కరణ



మహాశివరాత్రి గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : మండలంలోని గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన రాజుపాలెంలో ఈ నెల 18న మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఏకశిలా శివాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎంపీ సత్యవతిని ఆమె కార్యాలయంలో గురువారం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకు ముందు ఎంపీ సత్యవతి చేతుల మీదుగా మహాశివరాత్రి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగిరెడ్డి రాంబాబు, గొల్లవిల్లి నాగరాజు, జి.అప్పలసూరిబాబు, ఈశ్వరరావు, నర్సింగరావు, సూరిబాబు, వాసు, రవికుమార్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన వారపు సంత



కశింకోట వారపు సంత కిటకిట

కశింకోట : స్థానిక వారపు సంత గురువారం కళకళలాడింది. స్థానికులతోపాటు ఒడిశా కూలీలు తోడవ్వడంతో కిటకిటలాడింది. కూరగాయలు, ఆకు కూరలు, మసాలా దినుసుల అమ్మకాలు జోరుగా సాగాయి. ఇక్కడి శారదానది అవతల సుమారు పది ఇటుకల బట్టీల్లో దాదాపు 400 మంది కూలీలు ఒడిశా నుంచి వచ్చి పనిచేస్తున్నారు. వారు తమకు కావలసిన సరకులను ఇక్కడ సంత రోజు కుటుంబ సభ్యులతో తరలి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. వీరితోపాటు స్థానికులు ఒక్కసారిగా కొనుగోలు చేయడానికి రావడంతో సాయంత్రం సంత కిక్కిరిసింది. కూరగాయల అమ్మకాలు జోరుగా సాగాయి. ఎక్కువగా బంగాళాదుంపలు, ముల్లంగి, గోబీ పువ్వు, టమాటా, ఉల్లి తదితర కూరగాయలు, మసాల దినుసులను కొనుగోలు చేశారు.

స్థిరంగా కూరగాయల ధరలు: కూరగాయల ధరలు సంతలో ఈ వారం దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో ఉల్లి, టమాటా, బంగాళాదుంప రూ.20, వంకాయ రూ.30, దొండ, బెండ, క్యారెట్, బీట్‌రూట్ రూ.40, బీర, కాకర, చిక్కుడు రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి. గోబీపువ్వు ఒకటి రూ.10కి విక్రయించారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం



కశింకోటలో ఆయుర్వేద వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యాధికారి లావణ్య

కశింకోట : ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రి ఆయుష్ విభాగం ఆయుర్వేద వైద్యాధికారి కె.లావణ్య అన్నారు. కశింకోటలోని అగ్రహారం వరసిద్ధి వినాయక సేవా మందిరంలో గురువారం ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని నిర్వహించారు. రోగులను పరీక్షించి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యాన్ని అందించే ఆయుర్వేదం ప్రాచీన భారతీయ వైద్యమని కొనియాడారు. ఆయుర్వేద వైద్యం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అపోహాలను నివృత్తి చేశారు. వంటింటి దినుసులు ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడతాయో చిట్కాలు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం వి.వి.శాస్త్రి, బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు అవసరాల కామేశ్వరి, గుల్లెపల్లి వెంకటేశ్వరరావు, అవసరాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట : మండలంలోని జి.భీమవరంలో వెలసిన అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంతు వెంకట్, ఎంపీటీసీ సభ్యుడు అల్లం శంకరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కరణం లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఇళ్ల నిర్మాణం



జి.భీమవరంలో పూర్తయిన ఇళ్లు

కశింకోట : మండలంలోని జి.భీమవరం గ్రామంలో వైఎస్సార్ జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఉగాది నాటికి పనులు పూర్తి చేసే లక్ష్యంతో ఇళ్లను నిర్మిస్తున్నారు. సుమారు 90 మంది లబ్ధిదారులకు కొండ ప్రాంతంలో స్థలాలతోపాటు గృహాలను మంజూరు చేశారు. దీంతో గృహాల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే 20 వరకు గృహాలు పూర్తయ్యాయి. వీటిలో ఏడుగురు గృహ ప్రవేశాలు కూడా చేశారు. మిగిలిన ఇళ్ల లబ్ధిదారులతోపాటు నిర్మాణంలో ఉన్న లబ్ధిదారులు కూడా ఉగాదికి ప్రభుత్వం నిర్దేశించిన మేరకు గృహప్రవేశాలు జరిపేలా ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పునాది నుంచి శ్లాబ్ వరకు వివిధ దశల్లో ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శి బి.చిన్నోడు ప్రత్యేక శ్రద్ధ తీసుకు పనులను పర్యవేక్షిస్తూ ఉగాదికి ఇళ్లు పూర్తి అయ్యేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నారు. కాలనీకి ఇప్పటికే స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు వేసి విద్యుత్ సదుపాయం కల్పించారు. ఇళ్ల నిర్మాణానికి ఉచిత ఇసుక, సిమెంట్, ఐరన్‌ను అందిస్తున్నారు. నీటి సదుపాయం కల్పించారు. ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం



తగరంపూడిలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్ : ప్రకృతి వ్యవసాయం వల్ల మనుషుల ఆరోగ్యంతో పాటు భూమి సారాన్ని రక్షించుకోవచ్చని తగరంపూడి గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావు అన్నారు. అనకాపల్లి ప్రకృతి వ్యవసాయ విభాగం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తగరంపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహానికి ప్రభుత్వం చూపిస్తున్న చొరవను కొనియాడారు. రసాయనిక ఎరువుల వినియోగం వలన పంట భూములు చౌడు భూములుగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం గ్రామంలో వ్యవసాయ సిబ్బంది, మహిళా రైతులు గ్రామస్తులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంసీఏ శ్రీనివాస్, ఐపీఆర్పీలు, వీవోఏలు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.


ఎంపీడీవో సచివాలయాల సందర్శన



చింతలపాలెం సచివాలయంలో సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు

కశింకోట : మండలంలోని చింతలపాలెం, నూతలగుంటపాలెం సచివాలయాలను గురువారం ఎంపీడీవో కొంకి అప్పారావు సందర్శించారు. ఎస్‌జీడి సర్వే, ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు పరిస్థితిని సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమీక్షించారు. సర్వే, ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదును త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

చురుగ్గా చెరువు పూడికతీత పనులు



చెరువు పూడికతీత పనుల్లో ఉపాధి కూలీలు

కశింకోట : ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని అడ్డాం గ్రామం వద్ద ఉన్న సాగిరాజు చెరువులో పూడిక తీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగా చెరువు చుట్టూ తుప్పలను తొలగించి గట్లను పటిష్టం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. జి.భీమవరం గ్రామంలో ఉపాధి పనులు లేకపోవడంతో కూలీలను అడ్డాంకు తరలించి చెరువు పూడికతీత పనులను వారం రోజులుగా జరిపిస్తున్నారు. ఈ చెరువు ఆయకట్టున సుమారు 40 ఎకరాల సాగు భూమి ఉంది. చెరువును అభివృద్ధి చేస్తే ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందుతుందని రైతులు భావిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలకు బెంచీలు



కొత్త బెంచీల్లో విద్యార్థులు

కశింకోట : కశింకోటలోని బాలికల ప్రాథమిక పాఠశాలకు నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బెంచీలను సమకూర్చారు. ఇన్నాళ్లు నేలపై కూర్చునే చదువుకున్న విద్యార్థులు కొత్త బెంచీలు చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్ ప్రభుత్వ స్కూళ్లకు ఇస్తున్న ప్రాధాన్యతపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

'తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలి'

అనకాపల్లి రూరల్: మూతపడిన తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరవాలని బీజేపీ కిసాన్ మోర్చా నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఫ్యాక్టరీ వద్ద జరిగిన రైతుల సమావేశంలో రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు శశిధర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సహకార చక్కెర కర్మాగారాల పరిస్థితిని ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తుమ్మపాల చక్కెర కర్మాగారాన్ని తెరిపించడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నేతలు పీలా మురళి, గొంతిన భక్త సాయిరాం, భవన నిర్మాణ కార్మిక నేత అలమండ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ కె.సత్యారావు, కప్పిరి తాతారావు, రైతు నాయకుడు మద్దాల ఎరుకునాయుడు, కె.రామకృష్ణ, బుద్ద రామకృష్ణ పలువురు రైతులు పాల్గొన్నారు.

నూతన నియామకం

పరవాడ: మత్స్యకార జా యింట్ యాక్షన్ కమిటీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా ముత్యాలమ్మపాలేనికి చెందిన అరిజిల్లి అప్పలరాజు నియమితులయ్యారు. మత్స్యకారుల అభ్యున్నతి, హక్కుల సాధన కోసం తన వంతు కృషి చేస్తానని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.